క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లో తెలంగాణ బీసీసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చట్ట సభల్లో బీసీల వాటా సాధన కోసం మహాపాదయాత్ర పోస్టర్‌ను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాపాదయాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి, రమేశ్‌గౌడ్, సత్యం, బత్తుల మహేందర్ యాదవ్, కోటెశ్, మధు బాబు, కిషన్, చంద్రశేఖర్ తదితరులున్నారు.

మూఢ నమ్మకాలు వీడాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై మారుతి

వేములవాడరూరల్: గ్రామాల్లో అంటరానితనం, మూఢ నమ్మకాలు వీడి అందరూ కలిసికట్టుగా ఉండాలని ఎస్సై మారుతి అన్నారు. మండలంలోని అచ్చన్నపల్లి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పౌర హక్కులకు భంగం వాటిల్లకుండా ప్రతిఒక్కరూ చూడాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ



పుష్పగుచ్ఛం అందిస్తున్న గౌడ సంఘం సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండల నూతన ఎక్సైజ్ సీఐగా శ్రీనివాస్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పెద్దపల్లి జిల్లానుంచి బదిలీపై వచ్చిన శ్రీనివాస్ విధుల్లో చేరారు. బాధ్యతలు చేపట్టిన సీఐని మండల కేంద్రానికి చెందిన గౌడ సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సీఐని కలిసిన వారిలో సంఘం సభ్యులు నాగుల ప్రదీప్‌గౌడ్, గంట అంజాగౌడ్, గంట వెంకటేశ్ గౌడ్, నారాయణగౌడ్, సత్తయ్యగౌడ్, గంట దేవయ్య గౌడ్, విక్రంగౌడ్, ప్రవీణ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మురళిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

28వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న రాజు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండల మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు 28వసారి రక్తదానం చేశాడు. కొండాపూర్‌కు చెందిన అజయ్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న రాజు ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశాడు. ఇప్పటికే అత్యవసర పరిస్థితుల్లో 28సార్లు రక్తదానం చేసినట్లు రాజు తెలిపాడు. రాజును వైద్యులు, స్నేహితులు అభినందించారు.

బహుమతి అందజేత



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కానిస్టేబుల్

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని బాలరాజుపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న అశ్విత వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది. యాంటీ డ్రగ్స్‌పై పోలీసులు నిర్వహించిన పోటీల్లో విద్యార్థిని ప్రతిభ కనబర్చగా కానిస్టేబల్ దోస వెంకట్ ఆమెకు బహుమతి అందజేశారు. హెచ్ఎం అరుణ, బాలచందర్, రవి కుమార్, నేరెళ్ల బాబు, శ్రీనివాస్, చక్రపాణి, ప్రేమ్ కుమార్, రజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోనరావుపేట: మండలంలోని మరిమడ్ల ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు తెలిపారు. ఏదైనా ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి పూర్తిచేసిన 10–13 సంవత్సరాల్లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పాఠశాలలో సీబీఎస్ఈ విద్యా విధానంతో పాటు డిజిటల్ తరగతి గదుల ద్వారా బోధన అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు మార్చి 22 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మారుతున్న పల్లెల రూపురేఖలు



రాజన్నపేటలో వర్మీ కంపోస్ట్ తయారు చేస్తున్న సిబ్బంది

- గ్రామాల్లో కంపోస్ట్ ఎరువుల తయారీ
- అందుబాటులోకి 23 కంపోస్ట్ షెడ్లు
- జీపీలకు అదనపు ఆదాయం

ఎల్లారెడ్డిపేట: పల్లెల్లో సంపూర్ణ పారిశుధ్యం సాధించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతోంది. గ్రామాల్లో కంపోస్ట్ షెడ్లద్వారా ఎరువుల తయారీ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుస్తోంది. గ్రామస్థాయిలో సత్వరమే అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమేయ్యే నిధులు రాబట్టుకునేందుకు మార్గం సుగమం అవుతోంది. కంపోస్టు షెడ్లలో తయారు చేసి విక్రయించే సేంద్రియ ఎరువుల ద్వారా అదనపు ఆదాయంతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి. మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా 23 జీపీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన షెడ్లలో ఎరువులు తయారు చేస్తున్నారు. తయారు చేసిన ఎరువులను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ప్రక్రియ రోజూ శరవేగంగా కొనసాగుతోంది. అన్ని గ్రామ పంచాయతీల్లో షెడ్లను ఏర్పాటు చేసి తద్వారా ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

తడి, పొడిచెత్త సేకరణ

గ్రామాల్లో నివాసాల నుంచి రోజూ ట్రాక్టర్లు, ఆటోల ద్వారా తడి, పొడిచెత్త సేకరిస్తున్నారు. మహిళా సంఘాలు, పంచాయతీ ప్రత్యేక అధికారులు కార్యదర్శులు, సేకరించిన చెత్తనుంచి ఎరువుల తయారీపై పారిశుధ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. కంపోస్టు షెడ్లలోకి చేరుతున్న చెత్తతో ఎరువులు తయారు చేస్తున్నారు. పొడి చెత్తనుంచి ప్లాస్టిక్, పాత గ్లాసులు, పనికిరాని డబ్బాలు, అట్టలు తదితర వ్యర్థాలను సేకరించే గ్రామ పంచాయతీ సిబ్బంది వాటిని ప్రత్యేక గదుల్లో నిల్వచేస్తున్నారు. ఒకేసారి పెద్ద మొత్తంలో వాటిని విక్రయిస్తున్నారు. వ్యర్థాలతో ఒక్కో పంచాయతీకి నెలకు రూ.10వేలు, మేజర్ గ్రామపంచాయతీ రూ.15వేల వరకు ఆదాయం సమకూరుతోంది. దీంతోపాటు తడి, పొడిచెత్తను సేకరించి శివారు ప్రాంతాల్లోని కంపోస్ట్ షెడ్లకు తరలించడం ద్వారా గ్రామాలు సంపూర్ణ పారిశుధ్య ప్రాంతాలుగా తయారవుతున్నాయి. దీంతో పాటు అదనంగా వచ్చే ఆదాయంతో చిన్న, చిన్న అభివృద్ధి పనులు, పారిశుధ్య సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నారు. రోజూ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారులు సైతం ఈ కార్యక్రమాన్ని కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఎరువుల తయారీపై దృష్టి

ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచుల పదవికాలం ముగియడంతో ప్రత్యేక అధికారులు పాలన సాగిస్తున్నారు. గతంలో పాలకవర్గాలు కంపోస్ట్‌షెడ్లలో ఎరువులు తయారు చేయగా ప్రత్యేకపాలనలో సైతం ఎరువుల తయారీపై దృష్టిసారించాలని సిబ్బందిని ఆదేశిస్తున్నారు. నిత్యం తడి, పొడిచెత్త సేకరణపై దృష్టిపెట్టి ఎరువుల తయారీ ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని సూచిస్తున్నారు.

జీపీకి ఆదాయం



గ్రామంలో ముందుగా శుభ్రత కోసం తడి, పొడి చెత్త సేకరించే కార్యక్రమం చేపట్టాం. సేకరించిన చెత్తను ప్రాసెస్ చేసి ఎరువులు త యారు చేస్తున్నాం. దీంతో అదనపు ఆదా యం సమకూరుతోంది. అప్పటికప్పుడు చేసే పనులు సులభంగా పరిష్కారం అవుతున్నా యి. ఇప్పటివరకు చేపట్టిన విధంగానే ప్రత్యేక అధికారులు ఎరువుల తయారీపై దృష్టి పెట్టారు.

– ముక్క శంకర్, మాజీసర్పంచ్, రాజన్నపేట

నిరంతర ప్రక్రియ



పల్లెలను శుభ్రంగా ఉంచడమే కాకుండా చెత్త సేకరణ, ఆ తర్వాత వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీతో జీపీలు అదనపు ఆదాయం వస్తోంది. మండలంలో 23 గ్రామపంచాయతీల్లో ఈ ప్రక్రియ నిరంతం కొనసాగుతోంది. ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలో 23 కంపోస్ట్ షెడ్లను అందుబాటులోకి తెచ్చాం. మిగిలిన రాగట్లపల్లిలో షెడ్డు నిర్మాణం జరుగుతోంది. తొందర్లోనే అక్కడ ఎరువులు తయారు చేస్తాం.

– కొమురయ్య, ఏపీవో, ఎల్లారెడ్డిపేట

పట్టణ సమగ్రాభివృద్ధే లక్ష్యం

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కళ

సిరిసిల్లటౌన్: పట్టణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా మున్సిపల్ కౌన్సిల్ చర్యలు తీసుకుంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. గురువారం కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. మొత్తం 12 అంశాలతో కూడిన ఎజెండాను సభ్యులు ఆమోదించినట్లు పేర్కొన్నారు. రూ. 28. 58లక్షలు నీటి సరఫరా తదితర అవసరాలకు చెల్లించాల్సి ఉండగా కౌన్సిల్ ఆమోదించిందన్నారు. ఫిల్టర్‌బెడ్ నిర్వహణకు రూ. 5లక్షలు, రంజాన్ పండుగకు ఈద్గా, మసీదుల వద్ద మౌలిక వసతులు కల్పనకు రూ. 2లక్షలు, అన్నపూర్ణ భోజనం నిర్వహణకు రూ.16.58లక్షలు, పాత, కొత్తబస్టాండ్, కొత్తచెరువు, అంబేద్కర్ చౌక్, పోలీస్‌స్టేషన్ సర్కిళ్లలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు, మరమ్మతులకు రూ. 5లక్షలు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ లావణ్య, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలో పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణకు రూ.5లక్షలు కేటాయించగా అవి పనిచేయడం లేదని, అలాంటి వాటికి నిధులు కేటాయించమేంటని పలువురు కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఉత్తమ సేవలకు నిరంతర గుర్తింపు

సిరిసిల్లటౌన్: కరోనా వంటి కష్టకాలంలో ప్రాణాలకు తెగించి ఉత్తమ సేవలందించిన శానిటేషన్ కార్మికులకు గుర్తింపు ఉంటుందని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. సిరిసిల్ల శానిటేషన్ కార్మికురాలు నగునూరి లక్ష్మి గురువారం పదవీ విరమణ సందర్భంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. నూరుశాతం విధి నిర్వహణలో గడిపిన లక్ష్మిని ఘనంగా సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ లావణ్య, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై రమాకాంత్



అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రమాకాంత్ కోరారు. ఎల్లారెడ్డిపేటలో గురువారం రాత్రి పోలీస్ కమ్యూనిటీ మీటింగ్ నిర్వహించారు. ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థులు, మైనర్ బాలికలు ఫోన్లు వాడకంలో జాగ్రత్తలు వహించాలన్నారు. మహిళలకు ఏదైన ప్రమాదం ఉంటే వందకు డయల్ చేయాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఫోన్లకు వచ్చే ఓటీపీలు ఇతరులకు చెప్పొద్దని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట: సైబర్‌నేరాలపై అప్రమత్తత అవసరమని ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కనగర్తిలో మీకోసం కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం అందించాలన్నారు. ఆపద సమయంలో డయల్ 100కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో వంగపెల్లి దేవరాజు, సతీశ్, బొండ్ల రమేశ్, రావులపెల్లి మహిపాల్‌రెడ్డి, మో తుకుపెల్లి తిరుపతి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల పట్టాలు అందించాలి



మాట్లాడుతున్న బుర్రి ప్రసాద్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ అన్నారు. గురువారం పెద్దలింగాపూర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాన్ని సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ కోసం నిరుపేదలు ఎదురు చూస్తున్నారన్నారు. గ్రామసభ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసినా అధికారులు పంపిణీ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందించి ఇళ్ల పంపిణీకి చొరవ చూపాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నేరం నర్సయ్య, బాలరాజు, బైండ్ల మల్లేశం, మహేశ్, నర్సవ్వ, రేణుక, లక్ష్మి, భాగ్యలక్ష్మి, చంద్రయ్య, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



సన్మానిస్తున్న చైర్‌పర్సన్ కళ, కౌన్సిల్ సభ్యులు

సిరిసిల్లటౌన్: కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ లావణ్యను గురువారం చైర్‌పర్సన్ జిందం కళ తన చాంబర్‌లో సన్మానించారు. వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్‌తో పాటు అందరూ కౌన్సిలర్లు కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం గృహజ్యోతి, ఉచిత విద్యుత్ పథకాలను ప్రారంభించిన సందర్భంగా మండలంలోని రాజన్నపేటలో గురువారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ప్రజలు, నాయకులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే నాలుగు అమలు చేసినట్లు తెలిపారు. మరో రెండు పథకాలు అమలు చేసి కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నా యకులు దేవరాజు, భూపాల్‌రెడ్డి, బాపురెడ్డి, నర్సింలు, బాలయ్య, వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు.

నెంబర్‌ప్లేట్ లేని వాహనాలు నడిపితే చర్యలు

కోనరావుపేట: గ్రామాల్లో నెంబర్ ప్లేట్ వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని సీఐ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కనగర్తిలో గురువారం నెంబర్‌లేని ఇసుక ట్రాక్టర్లు, వాహనాలను ఆపివారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నెంబర్‌ప్లేట్ లేని వాహనాలు కనిపిస్తే సీజ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయనవెంట సీసీఎస్ ఎసై నాయుడు, సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'పల్స్ పోలియో'ను విజయవంతం చేయాలి



ముస్తాబాద్ : శిక్షణలో మాట్లాడుతున్న గీతాంజలి

ముస్తాబాద్: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పోతుగల్ వైద్యాధికారి బత్తుల గీతాంజలి అన్నారు. గురువారం పీహెచ్‌సీలో ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లకు పల్స్ పోలియో, సీపీఆర్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. ఈనల 3న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో 3వేల పైచిలుకు చిన్నారులను గుర్తించామన్నారు. మూడు మోబైల్ బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీపీఆర్‌పై వారికి వివరించారు. హెచ్‌ఈవో యాదగిరి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఈనెల 3న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారిణి స్రవంతి పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లకు పల్స్ పోలియోపై గురువారం శిక్షణనిచ్చారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో మొత్తం 41 కేంద్రాలుంటాయని, ఎల్లారెడ్డిపేటలో 30, వీర్నపల్లిలో 11 ఉంటాయన్నారు.5 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ టీకాలు వేయించాలన్నారు. డాక్టర్ లత, డాక్టర్ చిరంజీవి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై సుధాకర్, ప్రొఫెసర్లు

తంగళ్లపల్లి: మాదక ద్రవ్యాల నిర్మూలనకు యువత, విద్యార్థులు కృషిచేయాలని ఎస్సై దాస సుధాకర్ అన్నారు. గురువారం మండలంలోని జిల్లెల్ల వ్యవసాయ కళాశాల, ట్రైబల్ డిగ్రీ కళాశాలలో యాంటి డ్రగ్స్ అవగాహన 5కే రన్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రభుత్వం డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపట్టిందని, యువత మత్తుపదార్థాలకు బానిస కావద్దన్నారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నలింగాపూర్‌కు రంగనాయకసాగర్ నీరు



బానప్ప చెరువులోకి వెళ్తున్న నీరు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని చిన్నలింగాపూర్ గ్రామానికి కాలువ ద్వారా రంగనాయక సాగర్ నీరు చేరుతోందని ఎంపీటీసీ బైరినేని రాము అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ జేసీబీతో కోమిటి రాజిరెడ్డి పొలం నుంచి కిలోమీటర్ వరకు కాలువ తవ్వినట్లు తెలిపారు. దీంతో బానప్ప చెరువువరకు చేరిన రంగనాయక సాగర్ నీటితో గ్రామంలోని ఎల్లమ్మ చెరువు నిండనుందని హర్షం వ్యక్తంచేశారు. దీంతో రైతుల పంటలకు సాగునీరు అందనుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మల్లేశం, నలవేని మల్లేశం, పయ్యావుల బాలమల్లు, రైతులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న నాయకులు

ముస్తాబాద్: మండలంలోని పులిచేరుకుంట మైసమ్మ ఆలయం వద్ద సీడీఎఫ్ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించినట్లు గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి తెలిపారు. పులిచేరుకుంట మైసమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా విద్యుద్దీపాలు ఏర్పాటు చేశామన్నారు. సింగిల్‌విండో చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు తలారి నర్సింలు, బండారి సత్తయ్య, ప్రతాప్‌రెడ్డి, నరేశ్, విజయ్‌రెడ్డి, రాజేశం, తాళ్లరాజు, బాల్‌రెడ్డి, నల్లనర్సయ్య, అన్నం శ్రీధర్ రెడ్డి, కొండయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు భూమిపూజ

బోయినపల్లి: మండలంలోని తడగొండ, బోయినపల్లి, బూర్గుపల్లి, కోరెం, గుండన్నపల్లి, స్తంభంపల్లి గ్రామాల్లో ఈజీఎస్ నిధులతో నిర్మించే సీసీరోడ్ల పనులను ప్రారంభించనున్నారు. శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పనులకు భూమిపూజ చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీజేపీ నాయకుల సంబరాలు

బోయినపల్లి: బీజేపీ కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థిగా ఎంపీ బండి సంజయ్‌ను పార్టీ అధిష్ఠానం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం రాత్రి మండలకేంద్రంలో బీజేపీ నాయకులు పటాకులు కాల్చి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నాయకులు ఉదారి నర్సింహచారి, పరశురాం ఎడపల్లి, గంగాధర్ చారి, కొనుకటి హరీశ్, మినుకుల శ్రీనివాస్, రెడ్డవేని రాజు, శ్రీనివాసచారి, గంగిపల్లి స్వామి, ఓటకారి లక్ష్మీరాజం, అనిల్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువకుడికి 'గురుకుల' కొలువు



విజయ్ కుమార్

వీర్నపల్లి: గురువారం గురుకుల విద్యాసంస్థల బోర్డు ప్రకటించిన మెరిట్ జాబితాలో మండలంలోని బావుసింగ్ తండాకు చెందిన బట్టు విజయ్‌కుమార్ గురుకుల డిగ్రీ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించాడు. తల్లిదండ్రులు మంగవ్వ, హరిచంద్ రోజువారీ కూలీలు. విజయ్‌కుమార్ బావుసింగ్ తండాలో ప్రాథమిక విద్య, ఆరో తరగతి కోనరావుపేట మండలంలోని మరిమడ్ల, భద్రాచలంలో ఎనిమిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుకున్నాడు. సాహిత్యంలో నాలుగు పుస్తకాలు రాశాడు. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేస్తుండగానే ఉద్యోగం సాధించాడు.

సంక్షిప్త వార్తలు

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు మధుమాలతి అన్నారు. రాచర్లబొప్పాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ డే నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక వాహనం పట్టివేత

ముస్తాబాద్: మండలంలోని రామలక్ష్మణపల్లె మానేరు వాగునుంచి బొలెరో వాహనంలో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఏఎస్సై వెంకటరమణ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేయవద్దన్నారు. పట్టుబడిన వాహనాన్ని ఠాణాకు తరలించినట్లు తెలిపారు.

బీజేపీ నాయకులకు అభినందన

కోనరావుపేట: మండల బీజేపీ నాయకులను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అభినందించారు. మండలంలో ఇటీవల నిర్వహించిన ప్రజాహిత యాత్ర విజయవంతమైందని, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని మండల శాఖ అధ్యక్షుడు గొట్టె రామచంద్రంను, కార్యకర్తలను కోరారు.

రేపు 'విశ్వకర్మ యోజన'పై అవగాహన

వీర్నపల్లి: సంప్రదాయ చేతి వృత్తిదారుల కుటుంబాలకు సిరిసిల్లలోని లహరి గ్రాండ్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు గురువారం ఎంపీవో నరేశ్‌కుమార్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఎస్‌వీ.దశరథ్ అసిస్టెంట్ డైరెక్టర్ హైదరాబాద్ వారు పాల్గొని 18 రకాల చేతివృత్తుల వారికి అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

నేటినుంచి 'గాలికుంటు' టీకాలు

కోనరావుపేట: మండలంలోని గ్రామాల్లో నేటినుంచి జీవాలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందించనున్నట్లు మండల పశువైద్యాధికారి అంజిరెడ్డి తెలిపారు. శుక్రవారం ధర్మారం, 2న గొల్లపల్లి (కొలనూర్), 3న మర్తనపేట, 4న మల్కపేట, 5న రామన్నపేట, 6న నాగారం, 7న పల్లిమక్త, 8న కనగర్తిలో, 10న నిజామాబాద్‌లో, 11, మామిడిపల్లి, 12న నిమ్మపల్లి, 13న వట్టిమల్ల, 15న గొల్లపల్లి(వట్టిమల్ల), 17న బావుసాయిపేట, 18న మరిమడ్ల, 19న కోనరావుపేట, , 20న శివంగాలపల్లి, 22న ఎగ్లాస్‌పూర్, 23న కొండాపూర్, 24న వెంకట్రావుపేట, 25న కమ్మరిపేటతండా , 26న గోవిందరావుపేటతండా, 27న సుద్దాల, 28న మంగళ్లపల్లి, 30న జైసేవాలాల్ ఊరుతండా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ అడ్డగింత

- కానిస్టేబుల్ కళ్లుగప్పి ట్రాక్టర్‌తో సహా పరారీ



ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్, రామలక్ష్మణపల్లె మానేరువాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. గురువారం ఓ ఇసుక ట్రాక్టర్‌ను కానిస్టేబుల్ పట్టుకోగా ట్రాక్టర్‌తో సహా డ్రైవర్ పరారయ్యాడు. కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మానేరు వాగునుంచి పోతుగల్ మీదుగా ముస్తాబాద్ వస్తుండగా ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఠాణాకు తరలిస్తుండగా ముస్తాబాద్ బీడీ కార్మిక ఆస్పత్రి వద్దకు రాగానే డ్రైవర్ తనను నెట్టివేసి ట్రాక్టర్‌తో సహా పరారయ్యాడని తెలిపాడు. దీనిపై జిల్లా ఎస్పీ, సీఐకి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. విచారణ చేస్తున్నామని సీఐ సదన్‌కుమార్ పేర్కొన్నారు.